క్లుప్తంగా

అప్పన్నకు సహస్రనామార్చన



స్వామివారి సహస్రనామార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం సహస్రనామార్చన ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 1001 నామాలను పఠిస్తూ స్వామికి అర్చన చేశారు. విశేష హారతి ఇచ్చి, పూజలో పాల్గొన్న ఉభయదాతలకు తులసి ప్రసాదాన్ని అందించారు.

పీజీఆర్ఎస్‌కు 3 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 3 వినతులు అందాయి. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తిలో స్థలానికి ఆక్యుపెన్సీ ధ్రువపత్రం కోసం, 95వ వార్డు పాపయ్యరాజుపాలెంలో అక్రమ నిర్మాణం తొలగించాలని, 90వ వార్డు సచివాలయం(474) పరిధిలో అక్రమ నిర్మాణం జరుగుతుందని జోనల్ కమిషనర్ హైమావతికి ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదులను స్వీకరించి వాటిపై విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోవాల్సిందిగా టౌన్‌ప్లానింగ్ ఏసీపీకి జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘తిక్కవానిపాలెం తీరాన్ని అభివృద్ధి చేయండి’



ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రం అందించి సమస్యలను వివరిస్తున్న సర్పంచ్ మసేను

పరవాడ: తిక్కవానిపాలెం తీర ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ చేపల మసేను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పంచకర్లను పెందుర్తి క్యాంప్ కార్యాలయంలో సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. తిక్కవానిపాలెం తీర ప్రాంతానికి సందర్శకుల తాకిడి పెరిగినందున ఆ ప్రాంతాన్ని టూరిజం ప్రదేశంగా గుర్తించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలన్నారు. గ్రామంలో సామాజిక భవనం, గ్రామ పంచాయతీ భవనాల ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.

సత్యసాయి ఆలయ అభివృద్ధికి సహకారం



ఎమ్మెల్యే రమేష్‌బాబును సన్మానిస్తున్న సత్యసాయి ఆలయ ప్రతినిధులు

పెందుర్తి: సుజాతనగర్‌లోని సత్యసాయి ఆనంద నిలయం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. సోమవారం ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ రక్షణ గోడ నిర్మాణం పనులు త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇతర సౌకర్యాల కల్పనకు కూడా కృషి చేస్తానన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శానాపతి వసంత, సింహాచలం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

హోమియోపతి మందులు బాహ్య లక్షణాలను నియంత్రించవు. వాటి ఆధారంగా మూల హేతువు ఏదో వాటి మీద పని చేస్తాయి. రోగ లక్షణాలు కాకుండా.. కారకాలను దృష్టిలో పెట్టుకుని చేసే వైద్యం హోమియోపతి. అందుకే ఈ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. అడవివరం ప్రభుత్వ హోమియో వైద్యశాలకు వచ్చే ఓపీల సంఖ్యే ఇందుకు నిదర్శనం. అందుకు అనుగుణంగానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హోమియో వైద్యశాలల అభివృద్ధికి బీజం పడింది. అరకొర వసతుల మధ్య కునారిల్లుతున్న వైద్యశాలకు ‘ఆయుష్’ నిధులతో పునర్వైభవం తీసుకొచ్చారు.

హోమియో వైద్యశాలకు ‘ఆయుష్’





హోమియో వైద్యశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల గార్డెన్

- అడవివరం హోమియో ఆస్పత్రికి నూతన శోభ
- ఎన్ఏఎం నిధులు రూ.6.50 లక్షలతో అభివృద్ధి
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రత్యేక శ్రద్ధ
- ఆకర్షణగా ఔషధ మొక్కల గార్డెన్
- రుగ్మతలు తగ్గించేందుకు మందులతో పాటు యోగా శిక్షణ

సింహాచలం: అడవివరం హోమియో వైద్యశాలకు స్థానికంగా ఎంతో పేరు ఉంది. సింహాచలం, అడవివరం నుంచే కాకుండా వేపగుంట, గోపాలపట్నం, పెందుర్తి, పైనాపిల్ కాలనీ, ఆరిలోవ తదితర 20 గ్రామాల నుంచి రోగులు వైద్య సేవల కోసం వస్తుంటారు. పదిహేనేళ్ల వరకు ఒక శిథిల భవనంలో హోమియో వైద్యశాల ఉండేది. వర్షం వస్తే గోడలకు చెమ్మపట్టి వర్షం నీరంతా భవనంలోనే ఉండేది. 2013లో రూ.7.50 లక్షలతో అడవివరం ఆరోగ్య కేంద్రం ఆవరణలోనే హోమియో వైద్యశాలకి కొత్త భవనం నిర్మించారు. సౌకర్యాలు మాత్రం మరిచారు. అరకొర సౌకర్యాల మధ్యే వైద్యులు, సిబ్బంది సేవలు అందించేవారు.

ఎన్ఏఎం నిధులతో అభివృద్ధి

దీనావస్థలో ఉన్న అడవివరం హోమియో వైద్యశాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెల్‌నెస్ సెంటర్‌గా ఎంపిక చేసింది. అప్పుడే నేషనల్ ఆయుష్ మిషన్(ఎన్ఏఎం) నిధులు రూ.6.50 లక్షలతో అభివృద్ధికి ఆమోదం లభించింది. తాజాగా రూ.3.50 లక్షలతో భవన మరమ్మతులు, సీలింగ్ వర్క్, సెప్టిక్‌ట్యాంక్, పార్కింగ్ టైల్స్, టాయిలెట్ల రిపేర్లు, రంగులు తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. మరో రూ.3 లక్షలతో ఫర్నిచర్ తదితర సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. జీవీఎంసీ సహకారంతో ఎప్పటికప్పుడు భవనం చుట్టూ ఉన్న తుప్పలను తొలగిస్తున్నారు. దీంతో ఆస్పత్రి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి.

రోగులకు యోగా థెరపీ

హోమియో వైద్యశాలకి వచ్చే రోగులకు వైద్య సేవలు అందిస్తూనే సహజసిద్ధంగా కూడా కొన్ని రోగాలను నయం చేసుకునేందుకు యోగా శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు ఒక యోగా ఇన్‌స్ట్రక్టర్ ఆయుష్ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయుష్ కేంద్రానికి వచ్చే వారి రుగ్మతలను బట్టి ఏయే యోగాసనాలు వేయాలో వారికి నేర్పుతున్నారు. ముఖ్యంగా పెయిన్ మేనేజ్‌మెంట్, శ్వాస యోగ, ధ్యానం, స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్నారు.



ఆస్పత్రిలో పేషెంట్‌కి యోగా నేర్పిస్తున్న యోగా ఇన్‌స్ట్రక్టర్ బాలభాను



మందులు సిద్ధం చేస్తున్న కాంపౌండర్ పద్మావతి

పెరుగుతున్న ఆదరణ

హోమియోపతి వైద్యానికి ఆదరణ పెరుగుతోంది. ఇంగ్లిష్ మందులతో పోల్చితే బాగా చౌక. సరైన మందు వేసుకుంటే వెంటనే గుణం కనిపిస్తుంది. మళ్లీ ఆ వ్యాధి శాశ్వతంగా రాదన్న నమ్మకం ప్రజల్లో పెరుగుతోంది. హోమియో మందులకు సైడ్ ఎఫెక్ట్స్ లేకపోవడం కూడా ఆదరణకు కారణం. ఈ మందులు ప్రకృతిలో దొరికే పదార్థాలతోనే తయారు చేస్తారు. కృత్రిమ రసాయనాలు వినియోగించరు. రోగ లక్షణాలను గుర్తించి, అవసరమైన మందు పడకపోతే వ్యాధి నయమయ్యే గుణం కనిపించదు తప్ప, ఎలాంటి హాని ఉండదని నమ్మకం.

ఓపీ సేవల టైమింగ్స్

రోజుకి 40 నుంచి 50 మంది వరకు హోమియో వైద్యశాలలో వైద్య సేవలు పొందుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు ఓపీ సేవలు లభిస్తాయి.

గార్డెన్‌లో ఔషధ మొక్కలు

అశ్వగంథ, సరస్వతి, నల్లేరు, వేప, తులసి, కలబంద, తిప్పతీగ, పిల్లిపెసర, మందారం, ఆముదం, తెల్ల గన్నేరు, ఉల్లి, మిరియాలు, ఉసిరి, తమలపాకు, ఉమ్మెత్త, దానిమ్మ, వాము, పసుపు, అడ్డసార, నేలవేము, రణపాల, తంగేడు, ఇన్సులిన్, నేరేడు తదితర మొక్కలు ఉన్నాయి.

ఆకర్షణగా ఔషధ మొక్కల గార్డెన్

హోమియో వైద్యశాలకి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంతో పాటు ఔషధ మొక్కల విశిష్టతను తెలియజేసేందుకు ప్రస్తుత వైద్యాధికారి డాక్టర్ ఎమ్.అరుణ్‌ప్రకాష్ వినూత్న ఆలోచన చేశారు. ఆయుష్ కేంద్రం పక్కనే హెర్బల్ గార్డెన్‌ని ఏర్పాటు చేశారు. 27 రకాల ఔషధ మొక్కలను నాటి, వాటి వల్ల కలిగే ఉపయోగాలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేశారు. ఆ మొక్కలను అవకాశం ఉన్నంతమేర ఇళ్లల్లో పెంచుకోవాలని సూచిస్తున్నారు. తద్వారా కొన్ని సాధారణ వ్యాధులకు ఉపశమనం మనచేతుల్లోనే ఉంటుందని చెప్తున్నారు. ఆయుష్ కేంద్రానికి వచ్చే రోగులను హెర్బల్ ప్లాంట్ గార్డెన్ ఎంతగానో ఆకర్షిస్తోంది.



నూతన శోభతో అడవివరం ప్రభుత్వ హోమియో వైద్యశాల

ఓపీ సంఖ్య పెరిగేందుకు కృషి



ప్రస్తుతం హోమియో వైద్యశాలలో రోజుకి 40 నుంచి 50 మంది ఓపీ సేవలు పొందుతున్నారు. వైద్యశాల రూపురేఖలు మారి, సౌకర్యాలు సమకూరడంతో వైద్య సేవలను మరింత విస్తృతం చేస్తున్నాం. ఓపీ సంఖ్య కూడా పెరిగేందుకు కృషి చేస్తున్నాం. సీజనల్ వ్యాధులు, వైరల్ ప్రాబ్లమ్స్‌పై అవగాహన కల్పిస్తూ ప్రివెంటివ్ క్యాంపులు పాఠశాలల్లో నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు అవసరమైన మందులు కూడా అందిస్తున్నాం.

– డాక్టర్ ఎం.అరుణ్‌ప్రకాష్, వైద్యాధికారి, హోమియో వైద్యశాల

అగ్రతః శివరూపాయ.. ఏకబిల్వం శివార్పణం



పూజలందుకున్న పినగాడి చోడేశ్వరస్వామి



జుత్తాడలో పూజలందుకున్న శివుడు



అలంకరణలో విజినిగిరిపాలెం ఉమాచంద్రమౌళేశ్వరస్వామి

- ఘనంగా కార్తీక చివరి సోమవారం పూజలు
- భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు
- పలుచోట్ల భారీ అన్నసమారాధనలు

పెందుర్తి: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆఖరి సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. నియోజకవర్గంలోని శివాలయాల్లో లింగరూపంలోని పరమేశ్వరుడిని అభిషేకాలు, అర్చనలతో భక్తులు ఆరాధించారు. ప్రధాన ఆలయాల వద్ద తొలి వేకువ నుంచే భక్తులు బారులుతీరారు.

- పెందుర్తి సాధూమఠం వద్ద ఉన్న పురాతన రామలింగేశ్వరస్వామి దేవాలయంలో రుద్రాభిషేకాలు జరిగాయి. అర్చనలు చేశారు.
- పినగాడి చోడేశ్వరస్వామి దేవాలయంలో విశేష అభిషేకాలు జరిగాయి. భక్తులు బారులుతీరారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనలో దాదాపు 3 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.
- జుత్తాడలోని శివాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది.
- సరిపల్లి శివాలయంలో భక్తులు స్వహస్తాలతో శివునికి క్షీరాభిషేకాలు జరిపారు. మహానంది, ధ్వజస్తంభాలకు మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు.
- కృష్ణరాయపురంలోని శివాలయం, శ్రమశక్తినగర్ రామలింగేశ్వరస్వామి దేవాలయం, ప్రశాంతినగర్, చింతలగ్రహారం శివాలయం, సుజాతనగర్‌లోని హరిహరక్షేత్రం, పెందుర్తి మహాకామేశ్వరి ఆలయంలోని జ్యోతిర్లింగాల సన్నిధిలో పూజలు జరిగాయి.

సింహాచలం: సింహగిరిపైన, అడవివరంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చి పరమేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీపారాధన చేశారు.

- త్రిపురాంతకస్వామి ఆలయ ప్రాంగణంలో నాగేంద్రుడి వద్ద మహిళలు దీపారాధనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగానికి స్వయంగా పూజలు నిర్వహించారు.
- కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న రావి, వేప, మర్రి చెట్ల వద్ద పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. గంగధార వద్ద భక్తులు స్నానాలు ఆచరించి అక్కడ ఉన్న శివలింగాలకు పూజలు జరిపారు. కొండదిగువ పూలతోటలోని ప్రాచీన శివలింగం వద్ద భక్తులు విశేషంగా తరలివచ్చి, గంగా జలాలతో అభిషేకాలు నిర్వహించారు.
- 98వ వార్డు పాత అడవివరం, కాపుదిబ్బ, స్వామి కల్యాణమండపం శివాలయాలకు భక్తులు పోటెత్తారు.
- సింహపురికాలనీ శివాలయంలో భక్తులు అభిషేకాలు జరిపారు. ధ్వజస్తంభాల వద్ద, తులసికోట, ఉసిరిచెట్టు వద్ద దీపారాధన చేశారు.
- విజినిగిరిపాలెం దరి చంద్రాగార్డెన్స్ ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు ఉదయ్ కృష్ణశర్మ ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు.
- 93వ వార్డు ప్రహ్లాదపురం శివాలయంలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. దీపారాధన చేశారు.

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో కార్తీకమాసం ఆఖరి సోమవారం భక్తులు పోటెత్తారు. హైదరాబాద్, ఢిల్లీ వంటి నగరాల నుంచి వచ్చిన భక్తులు, సాధకులు రుద్రాభిషేకాలు నిర్వహించారు.

- మొగలిపురం విఘ్నేశ్వర ఈశ్వర ఘాట్ వద్దనున్న ఈశ్వరాలయంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ ఆధ్వర్యంలో వెయ్యి మంది అయ్యప్ప మాలధారణ భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. సహస్ర దీపార్చన జరిపారు. పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడీ బాబు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, ఎమ్మెల్యే దేముడు తదితరులు పాల్గొన్నారు.
- మండలంలోని లింగాలతిరుగుడు స్వయంభూ సోమలింగేశ్వరస్వామి, ఇరువాడ స్వయంభూ భీమలింగేశ్వరస్వామి, సబ్బవరంలోని ఉమా రామలింగేశ్వరస్వామి, పెదయాతపాలెం ద్వాదశ జ్యోతిర్లింగ సహిత గౌరీపరమేశ్వరులు, గొర్లివానిపాలెం ఉమా రామలింగేశ్వరస్వామి, వంగలి సోమలింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దక్షవాటిలోని పంచభూత లింగేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



పినగాడి శివాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



మొగలిపురంలో సహస్ర దీపార్చనలో పాల్గొన్న గండి రవికుమార్ తదితరులు

కల్వర్టుకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

ఊటగెడ్డ వద్ద కల్వర్టుకు మరమ్మతులు చేపట్టిన దృశ్యం

పరవాడ: యలమంచిలి–గాజువాక రహదారిలో ఊటగెడ్డ కూడలికి సమీపంలో శిథిలావస్థలో ఉన్న కల్వర్టు రక్షణ గోడకు ఆర్ అండ్ బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. శిథిలావస్థకు చేరిన కల్వర్టులు శీర్షిన సాక్షిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించారు. అచ్యుతాపురం నుంచి పరవాడ వరకు రహదారి మరమ్మతులు చేపట్టిన అధికారులు ఊటగెడ్డ కూడలికి సమీపంలో పాడైన రెండు కల్వర్టుల రక్షణ గోడలకు కూడా మరమ్మతులు చేశారు. రక్షణ గోడలను పునరుద్ధరించడంతో రహదారి ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రాష్ట్రంలో మహిళలపై విపరీతమైన దాడులు

- కూటమి ప్రభుత్వంలో స్త్రీలకు రక్షణ లేదు
- మహిళా హింస వ్యతిరేక దినోత్సవంలో ఐద్వా నాయకురాలు రమణి



ఆందోళన వ్యక్తం చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

పెందుర్తి: రాష్ట్రంలో ఇటీవలి కాలంలో బాలికలు/మహిళలపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయని ఐద్వా జిల్లా నాయకురాలు బి.రమణి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు పూర్తిస్థాయి రక్షణ కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు రక్షణ లేకుండా చేసిందని విమర్శించారు. ఐద్వా ఆధ్వర్యంలో జీవీఎంసీ 95వ వార్డు జ్యోతినగర్‌లో సోమవారం మహిళా హింస వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమణి మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ చిన్నపిల్లలపై కూడా లైంగిక దాడులు జరగడం ప్రభుత్వాల చేతకానితనానికి నిదర్శనమన్నారు. ఏకంగా సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్ సొంత నియోజకవర్గాల్లోనే ఇటీవల చిన్న పిల్లలపై అత్యాచారాలు జరిగాయన్నారు. ప్రభుత్వ పెద్దలు నిందితులను తప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శలు ఎదుర్కోవడం రాష్ట్రానికి మంచిది కాదన్నారు. ఐద్వా సీనియర్ నాయకురాలు బి.అనంతలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా చట్టాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో చిన్న అమ్ములు, మధు, భాను, గంగమ్మ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



లారస్ ల్యాబ్ వాహన డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనల్ని వివరిస్తున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ

పరవాడ: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ హెచ్చరించారు. ఫార్మాసిటీలో లారస్ ల్యాబ్ పరిశ్రమకు చెందిన వాహన డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద సంయమనం పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపడం చట్ట విరుద్ధమన్నారు. వాహన డ్రైవర్లు చేసే పొరపాట్లతో సంస్థలకు చెడ్డపేరు రాకుండా చూసుకోవాలన్నారు. అవగాహన సదస్సులో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, లారస్ పరిశ్రమ హెచ్‌ఆర్ పి.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో రామచంద్ర జీయర్‌స్వామి



బేడా మండపంలో ప్రదక్షిణ చేస్తున్న రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని శ్రీ భాష్యకార సిద్ధాంత పీఠం రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి దర్శించుకున్నారు. ఆయనకు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు.

గెడ్డవాగు ఆక్రమణకు అడ్డుకట్ట



పొక్లెయిన్‌తో ట్రెంచ్ తవ్విస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెంలో గెడ్డవాగు ఆక్రమణలకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. గొల్లలపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.219లో గెడ్డవాగు/వాగు పోరంబోకు భూమి ఉంది. సదరు భూమిని అనుకుని ఎగువన జిరాయితీ భూమిలో ఓ ప్రైవేట్ వ్యక్తి లే అవుట్ వేస్తున్నారు. ఈ లే అవుట్‌కు ప్రధాన రహదారిగా ఉన్న గెడ్డవాగును అక్రమించి సదరు స్థలం నుంచి లే అవుట్‌కు ఇటీవల గ్రావెల్ రోడ్డును వేశారు. స్థానికుల సమాచారం మేరకు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ చర్యలు తీసుకోవాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. ఆర్ఐ వీరయ్య, మిగిలిన సిబ్బందితో వెళ్లి సోమవారం పొక్లెయిన్ సాయంతో ట్రెంచ్ తవ్వారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి



సమావేశంలో సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐ సింహాచలం

సబ్బవరం: ప్రజా భద్రత దృష్ట్యా మండలంలోని అన్ని వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థల వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ పిన్నింటి రమణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేర నియంత్రణలో గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. మండల కేంద్రంలో సుమారు 250, గ్రామాల్లో 120 వాణిజ్య సముదాయాలు, షాపులను గుర్తించామన్నారు. ఇప్పటికే వారికి నోటీసులిచ్చినట్లు వెల్లడించారు. రూ.20 వేలు వెచ్చిస్తే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఎస్ఐ సింహాచలం పాల్గొన్నారు.

వీఆర్వోను దుర్భాషలాడిన వ్యక్తికి రిమాండ్

పరవాడ: వీఆర్వో విధులకు భంగం కలిగించడంతోపాటు, దుర్భాషలాడిన పరవాడ గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ప్రభుత్వ స్థలంలో ఇస్మాయిల్ నిర్వహిస్తున్న మాంసం దుకాణాన్ని తహసీల్దార్ ఆదేశాల మేరకు ఈ నెల 22న వీఆర్వో సత్యనారాయణ సిబ్బందితో వెళ్లి తొలగించారు. కార్యాలయానికి వస్తున్న క్రమంలో ఇస్మాయిల్, అతని తల్లి ఫాతిమాబేబీలు అడ్డగించారు. దీనిపై వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కేసును ఎస్ఐ బి.కృష్ణారావు దర్యాప్తు జరపగా ఇస్మాయిల్ పత్రికా విలేకరిగా చెప్పుకొంటూ వాట్సాప్ గ్రూపుల్లో అధికారులు, నాయకులపై తప్పుడు కథనాలు ప్రచురిస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వెల్లడైందన్నారు. ఇస్మాయిల్‌ను అరెస్టు చేసి అనకాపల్లి కోర్టులో హాజరుపరచగా, కోర్టు అతనికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.